ఏజెన్సీలో 'ఎండియు'తో రేషన్ అందించాలి

కంటోన్మెంట్ : గిరిజన ప్రాంతాలలో రేషన్ సరఫరాను పాత ఎండియు విధానంలోగానీ,ప్రత్యేక రేషన్ డిపోలను ఏర్పాటు చేయడం ద్వారాగాని రేషన్ పంపిణీ చేయాలని రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు కోరారు. రేషన్ తీసుకోవడంలో గిరిజనులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై వచ్చిన పత్రికా కథనాలపై ఆయన స్పందించారు. ప్రస్తుతం రేషన్ తీసుకోవడంలో గిరిజనులు పడుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతూ సివిల్ సప్లై కమిషనర్‌కు లేఖ రాసినట్లు తెలిపారు. ఏజన్సీ ప్రాంతవాసులఆహార భద్రతకు దూరంగా వున్న పరిస్థితులున్నాయని, ఈ నేపథ్యంలో ఎండియు విధానాన్ని ఆపడం వల్ల ప్రభుత్వం అందించే సరుకులు కూడా తీసుకోవడం వారికి ఇబ్బందిగా మారిందన్నారు. ప్రధానంగా గిరిజన గ్రామాలకు రేషన్ డిపో లు సమీపంలో లేకపోవడంతో చాలా దూరం వ్యయ ప్రయాసల కోర్చి గిరిజనులు రేషన్ తీసుకోవాల్సి వస్తోందని తెలిపారు. గిరిజనుల ఇబ్బందులను దృష్టిలో వుంచుకుని ఏజెన్సీ ప్రాంతాలలో పాత ఎండియు విధానాన్నే కొనసాగించాలని డాక్టర్ శంకరరావు కోరారు.

తల్లికి వందనంపై పిల్లిమొగ్గలు..!

- జిఒ 26 పేరుతో నిబంధనలు
- రూ.2 వేలు కోత
- భారీగా తగ్గిన విద్యార్థుల సంఖ్య

పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు అందించే తల్లికి వందనం పథకంపై టిడిపి కూటమి ప్రభుత్వం పిల్లిమొగ్గలు వేస్తోంది. జీవో 26 పేరిట సవాలక్ష నిబంధనలతో జిల్లాలో వందలాది మంది విద్యార్థులను తల్లికి వందనం పథకానికి దూరం చేసింది. వేర్వేరు కారణాలతో ఒక్కో గ్రామంలో పది నుంచి 50 మంది వరకు అనర్హులుగా ప్రకటించింది. వీరిలో పలువురు అర్హులు కూడా ఉన్నారు. జిల్లాలోని చాలా మంది పేర్లను వేరే జిల్లాల్లో మ్యాపింగ్ అయినట్లు జాబితాలో చూపించడం, కొందరు అర్హులను అనర్హులుగా చూపడంతో విద్యార్థుల తల్లిదండ్రులు లబోదిబోమంటున్నారు.



ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తల్లికి వందనం పేరిట విద్యార్థుల తల్లిదండ్రుల బ్యాంకు ఖాతాల్లో పాఠశాలలు తెరిచేనాటికి రూ.15వేలు చొప్పున ఎంతమంది పిల్లలుంటే అందరికీ జమ చేస్తామని సాక్షాత్తు ముఖ్యమంత్రి ప్రకటించారు. తల్లికి వందనం డబ్బులు పడతాయి పిల్లలకు కావాల్సిన పుస్తకాలు, ఫీజులు కట్టుకోవచ్చని ఎదురు చూసిన కొందరు తల్లి తండ్రులకు నిరాశే ఎదురైంది. ఒకటి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులకు తల్లికి వందనం పథకం అమలుకు గురువారం ఎట్టకేలకు మార్గదర్శకాలు విడుదల అయ్యాయి. గత ప్రభుత్వంలో అమలు చేసిన అమ్మఒడికి ఉన్న నిబంధనలను కూటమి ప్రభుత్వం కూడా అమలు చేసేలా ఆదేశాలు ఇచ్చింది. ఈ పథకానికి సంబంధించి రాష్ట్ర స్థాయిలో ఒక ఖాతాకు నిధులను కేటాయిస్తూ విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నిధులు జమ చేసేందుకు పలు మార్గదర్శకాలను రూపొందిస్తూ జీవో 26ను ప్రభుత్వం విడుదల చేసింది. 2020 జనవరిలో ఒక్క విద్యార్థికి రూ.14 వేలు, ఆ తరువాత మూడేళ్ల రూ.13వేలు చొప్పున ఇవ్వగా కూటమి ప్రభుత్వం దీనినే ప్రమాణికంగా తీసుకుని ఒక్కో విద్యార్థికి రూ.13 వేలు జమ చేసేందుకు ఉత్తర్వులు ఇచ్చింది. ఒక్కో విద్యార్థికి కేటాయించిన రూ.15వేలలో రూ.2వేలు పాఠశాల అభివృద్ధి పేరిట కోత విధించారు. ప్రస్తుతం ఇచ్చే తల్లికి వందనం పథకం ప్రస్తుత విద్యా సంవత్సరం 2025-26కి సంబంధించి నవేనని ఉత్తర్వుల్లో తెలిపారు. ఒక్కో విద్యార్థికి రూ.13వేలు చొప్పున చెల్లిస్తామని పేర్కొంది. ఈమేరకు సచివాలయాల వారి అర్హులు, అనర్హుల జాబితాలను విడుదల చేశారు. వాటిని పరిశీలిస్తే చాలా మంది అర్హులను అనర్హులుగా చూపించారని తల్లిదండ్రులు వాపోతున్నారు.

జిఒ 26లో నిబంధనలు ఇవే..

ప్రస్తుత విద్యా సంవత్సరంలో 75శాతం హాజరు ఉన్న వారికి వచ్చే విద్యా సంవత్సరంలో ఈ పథకానికి అర్హులుగా పరిగణిస్తారు. బియ్యం కార్డు తప్పని సరిగా ఉండాలి. ఈ మేరకు పాఠశాలల ప్రిన్సిపల్స్,హెచ్ఎంలు విద్యార్థుల వివరాలు నమోదు చేయాలి. విద్యార్థులు, వారి తల్లి, తండ్రి లేక సంరక్షకుల ఆధార్ నంబర్లు చెల్లుబాటులో ఉండాలి. కుటుంబ ఆదాయం నెలకు గ్రామాల్లో రూ. 10 వేలు, పట్టణాల్లో రూ.12 వేలు మించి ఉండరాదు. పట్టణాల్లో 1000 చదరపు అడుగులకు మించిన విస్తీర్ణంలో ఇల్లు ఉండకూడదు. భూములు మాగాణి అయితే 3 ఎకరాలు, మెట్ట 10 ఎకరాలకు మించి ఉండరాదు. ఇంట్లో ఎవ్వరికీ నాలుగు చక్రాల వాహనం ఉండకూడదు. సరాసరి నెలకు 300 యూనిట్లకు మించి కరెంటు వినియోగం ఉండరాదు. ఆదాయం పన్ను చెల్లించేవారు ఈ పథకానికి అనర్హులుగా పేర్కొన్నారు. ఇప్పటికే ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయం ఉన్న (ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, ట్రిపుల్ ఐటి చదవివే వారు) తల్లులను అనర్హులుగా పేర్కొన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి 1నుండి 12 తరగతులలో నమోదు ప్రక్రియ పూర్తయిన తర్వాత ఈ ఆర్థిక సహాయం పరిశీలిస్తారు. ఈనెల 28 వరకు అర్హులైన విద్యార్థుల జాబితాలను తయారు చేసి 30న గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శించాలి. విద్యార్థులు తమపేర్లను ఆయా పాఠశాలల్లో నమోదు చేసుకుంటేనే వారికి తల్లికి వందనం వర్తిస్తుంది. జులై 5న తల్లికి వందనం పేరుతో ఆర్థిక సహాయం తల్లుల బ్యాంకు ఖాతాలకు జమ అవుతుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అయితే కొందరు విద్యార్థుల తల్లుల ఖాతాల్లో శుక్రవారం డబ్బులు పడ్డాయి. ఈ విధంగా 25శాతం మందికి పడినట్లు తెలుస్తోంది. కొత్తగా పాఠశాలల్లో చేరిన వారు ఈనెలాఖరులోగా దరఖాస్తు చేసుకుంటే వచ్చేనెల 5న వారి తల్లిదండ్రుల ఖాతాల్లో డబ్బులు వేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

గతంలో విడుదలైన అమ్మఒడి వివరాలు

సంవత్సరం	విద్యార్థులు	నగదు(రూ.లో)
2019-20	1,73,460	260,19,00,000
2020-21	1,63,146	244,71,90,000
2021-22	1,73,440	260,16,00,000
2022-23	1,66,180	249,27,00,000

విద్యార్థులందరికీ వర్తింప చేయాలి

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన నిరసన

తల్లికి వందనం పథకం విద్యార్థులం దరికీ వర్తింపజేయాలని, నిబంధనల పేరుతో విద్యార్థుల సంఖ్యను తగ్గించే ప్రయత్నం మానుకోవాలని, రూ.15వేలు పూర్తిగా చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు శుక్రవారం నగరంలో నిరసన ర్యాలీ చేపట్టారు. తోటపాలెం నుంచి మయూరి జంక్షన్ మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద రాస్తారోకో చేపట్టారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి.రాము మాట్లాడుతూ విద్యార్థులకు ఇచ్చే రూ.15వేలలో రూ.2 వేలు స్కూల్ నిర్వహణ ఖర్చులకు ఇవ్వాలని చెప్పడం సరైందని కాదన్నారు. పూర్తిగా ప్రతి విద్యార్థికి 15వేలు చొప్పున తక్షణమే జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సోమేష్, రమేష్, వంశీ, వెంకీ, శిరీషా, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి కాంప్లెక్సు సెంటర్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన మానవహారం చేస్తున్న విద్యార్థులు

మున్సిపల్ కార్మికులపై కేసు కొట్టివేత

ప్రజాశక్తి-బొబ్బిలి

హర్షం వ్యక్తం చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

మున్సిపల్ పారిశుధ్య కార్మికులపై 2018లో పెట్టిన కేసును శుక్రవారం బొబ్బిలి కోర్టు కొట్టివేసింది. జిఒ 279కు వ్యతిరేకంగా మున్సిపల్ కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేపట్టడంతో ప్రయివేట్ కార్మికులను మున్సిపల్ అధికారులు పెట్టారు. వారిని కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు అడ్డుకున్నారు. అప్పట్లో మున్సిపల్ ఆస్తులను ధ్వంసం చేసినట్లు 20 మంది కార్మికులపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీనికి ఎటువంటి ఆధారాలూ లేకపోవడంతో శుక్రవారం బొబ్బిలి కోర్టు కేసును కొట్టివేసింది. దీంతో కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. కార్మికుల పక్షాన సీనియర్ న్యాయవాది చందాన సూర్యనారాయణ కేసును వాదించారు.

రూ.2500 కోట్లు బిజినెస్ లక్ష్యం

సూర్యఘర్ పథకానికి రూ.10కోట్లు రుణాలు : డిసిసిబి చైర్మన్ నాగార్జున

ప్రజాశక్తి- కంటోన్మెంట్

సహకార కేంద్ర బ్యాంకు అభివృద్ధి కోసం సహకరించాలని డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. డిసిసిబి చైర్మన్ గా బాధ్యతలు తీసుకున్న సందర్భంగా విజయవాడ లో శుక్రవారం ఆప్కాబ్ ప్రధాన కార్యాలయంలో ఎండి శ్రీనాథ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ విజయనగరం జిల్లా సహకార బ్యాంక్ అభివృద్ధి కోసం సహకరించాలని కోరారు. జిల్లాలో ప్రజలకు ప్రధాన మంత్రి ముఫ్త్ బిజిలి యోజన పథకం కోసం 10కోట్లు రూపాయలు రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంనకు డిసిసిబి ద్వారా రూ.2500 కోట్లు బిజినెస్ లక్ష్యం పెట్టుకున్నామని తెలిపారు.

నాగార్జునను సత్కరిస్తున్న ఆప్కాబ్ ఎమ్‌డి శ్రీనాథ్‌రెడ్డి

అనుమతులు లేని నిర్మాణాలపై కొరడా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అనుమతులు లేని నిర్మాణాలను ఉపేక్షించబోమని కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. తోటపాలెంలోని ఒక భవనంపై అనుమతులు లేకుండా అంతస్తు నిర్మించడాన్ని గుర్తించి తక్షణమే తొలగించాలని ప్రణాళిక సిబ్బందికి ఆదేశించారు.

దీంతో ప్రణాళిక సిబ్బంది అక్కడికి చేరుకుని ఆ నిర్మాణాన్ని కూల్చి వేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టరాదని చెప్పారు.

సమ్మెను విజయవంతం చేయాలి

సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి సురేష్



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్

ప్రజాశక్తి-తెర్లాం

జులై 9న చేపట్టే దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి కె.సురేష్ పిలుపునిచ్చారు. మండలంలో పాత వెలుగు కార్యాలయంలో సిఐటియు నాయకులు ఎస్.గోపాలం ఆధ్వర్యంలో అంగన్వాడీ, ఆశా వర్కర్లు, ఆటో డ్రైవర్లు, అన్ని సంఘాల కార్మికులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం కార్మికుల గొంతు కోసే నాలుగు లేబర్ కోడ్‌ల అమలుకు సిద్ధమైందని ఆగ్రహం వ్యక్తంచేశారు. రవాణా రంగంలో మోటార్ వాహనాల చట్టం ద్వారా భారీ జరిమానాలు, కేసులు పెట్టి వాహనదారులను వేధిస్తోందన్నారు. స్కీమ్‌వర్కర్లకు ఎలాంటి భద్రతా లేదని, గ్రాట్యుటీ, పింఛన్లు అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. మరోవైపు ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్నారని దుయ్యబట్టారు. మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జులై 9న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సిఐటియు మండల కార్యదర్శి జి.లక్ష్మి, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

విమాన ప్రమాద మృతులకు కొవ్వొత్తులతో ఘన నివాళి

ప్రజాశక్తి-బొబ్బిలి

మాన ప్రమాదంలో మృతి చెందిన వారికి బొబ్బిలి రోటరీ క్లబ్, ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ సిబ్బంది, విద్యార్థులు కొవ్వొత్తులతో ఘన నివాళు లర్పించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఐటిఐ ప్రాంగణంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. రోటరీ జిల్లా అధ్యక్షులు జెసి రాజు, రోటరీ ప్రెసిడెంట్ ఎలెక్ట్ హరి, కార్యదర్శి ఎలెక్ట్ శివకాంత్, ఐటిఐ సిబ్బంది సిహెచ్ రాజు, సిహెచ్ ప్రసాద్, కె.త్రినాథరావు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న రోటరీ ప్రతినిధులు, ఐటిఐ సిబ్బంది, విద్యార్థులు

ఒకరి రక్తదానం.. మరొకరికి ప్రాణదానం

- యువత నుంచే అధిక రక్త సేకరణ
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం

ప్రజాశక్తి-కంటోన్మెంట్

మానవ శరీరంలో రక్తం ప్రాధాన్యత చాలా ఉంది. శరీరంలోని వివిధ బాగాలకు రక్తం ద్వారానే ఆక్సిజన్, హార్మోన్లు, పోషకాలను అందుతాయి. కణాలలోని జీవక్రియ వ్యర్థాలను తొలగించడంలో రక్తం దోహదపడుతుంది.

గత ఐదేళ్లలో రక్తదాన శిబిరాల ద్వారా సేకరించిన రక్తం యూనిట్లు

సంవత్సరం	రక్త సేకరణ	క్యాంపులు	లక్ష్యం	సేకరణ
2022-23	19275	264	19,300	20275
2023-24	20869	287	19,300	22816
2024-25	21,777	182	19,300	23761
2024-25(మే)	2953	25	3217	3294

అందుకే రక్తదానం మరొకరి ప్రాణదానం అంటారు. ప్రధానంగా రోడ్డు ప్రమాదాలు, శస్త్ర చికిత్సల సమయంలో రక్తం ఎక్కువగా అవసరం అవుతోంది. జిల్లాలో 8 బ్లడ్ బ్యాంకులు, 8 రక్త నిల్వల కేంద్రాల ద్వారా రోగులకు అందిస్తున్నారు. ఒక్క వేసవి కాలంలో మినహా మిగతా కాలంలో రక్తం జిల్లాలో పుష్కలంగా అందుతోంది. జిల్లాలో ఎక్కువ సార్లు రక్తం దానం చేసిన వ్యక్తులు ఉన్నారు. బొడ్డేపల్లి రామకృష్ణారావు 178 సార్లు, ఐ.గోపాలరావు 80సార్లు , దుర్గాప్రసాద్ 78 సార్లు రక్తదానం చేశారు. ఇంకా చాలా మంది రక్తదానం చేసిన వ్యక్తులు ఉన్నారు.ఇలాంటి వారిని ప్రేరణగా తీసుకుని మరి కొంత మంది రక్తదానం చేయాలి.

రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకు

ఎస్‌బిఐ రీజనల్ కార్యాలయంలో రక్తదాన శిబిరం

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 70వ వార్షికోత్సవం సందర్భంగా విజయనగరం రీజనల్ బ్రాంచ్ కార్యాలయ రీజనల్ మేనేజర్ ఎం.సురేష్ బాబు ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ రక్తాన్ని సేకరించింది. కార్యక్రమంలో విజయనగరం రీజన్ ఆఫీసర్స్ అసోసియేషన్ జోనల్ సెక్రెటరీ డి.మృదుల, యూనియన్ జోనల్ సెక్రెటరీ ఎం.రమేష్ కుమార్, ఎస్‌బిఐ ట్రైనింగ్ సెంటర్ ఎటిఎం కె.రామచంద్ర, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ కె ఆర్ డి ప్రసాదరావు, రెడ్ క్రాస్ ప్రతినిధి ఎం. రాము తదితరులు పాల్గొన్నారు.

వారికి ఉచితంగా అందిస్తున్నాం

2019-20 సంవత్సరం లో 59 క్యాంపల ద్వారా 2620 యూనిట్లు, 2020-21 లో 35 క్యాంపుల్లో 1733 యూనిట్లు సేకరించారు. 2021-22లో 36 క్యాంపులు నిర్వహించగా 1132 యూనిట్లు, ఫ్రీ యూనిట్స్ 318 సేకరించారు. 2022-23లో 47 క్యాంపుల ద్వారా 1521 యూనిట్లు, 2023-24లో 41 క్యాంపుల ద్వారా 2329 సేకరించారు. ఈ విధంగా 2006 నుంచి 2025 వరకు 60,409 యూనిట్ల రక్తాన్ని రోగులకు అందించారు.సేకరించిన రక్తంలో 30శాతం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు ఉచితంగా అందజేస్తున్నాం.

- కె.ఆర్.డి ప్రసాద రావు, చైర్మన్, కె.సత్యం, కార్యదర్శి రెడ్ క్రాస్ విజయనగరం

ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తి ప్రత్యేక కథనం..

జిల్లాలోని బ్లడ్ బ్యాంకులు : రాజంలోని జిఎంఆర్ , నెల్లిమర్ల మిమ్స్, విజయనగరంలో సర్వజన ఆస్పత్రి, ఎన్‌విఎన్, న్యూ లైఫ్ బ్లడ్‌బ్యాంకు, ఐఆర్‌సిఎస్, రోటరీ, బొబ్బిలి బ్లడ్‌బ్యాంకు ఉన్నాయి.

రక్త నిల్వల కేంద్రాలు : బొబ్బిలి, గజపతి నగరం, చీపురుపల్లి, నెల్లిమర్ల, రాజాం, ఎంసిహెచ్ ఘోషా, భోగాపురం ఎస్.కోట

రక్తదానానికి ముందుకు రావాలి

రక్తం దానం చేయడానికి యువత ముందుకు రావాలి.జిల్లా వ్యాప్తంగా రక్తదానం పై అవగాహన కార్యమాలు నిర్వహిస్తున్నాం. జిల్లా కేంద్రలోని గుమ్చీ సమీపంలో ఎన్‌విఎన్ బ్లడ్ బ్యాంకు ను 2017 ఆగస్ట్ 10న నీడ్స్ సొసైటీ పేరుతో ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి జిల్లా వ్యాప్తంగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి రక్తం అందిస్తున్నారు.తలసేమియా పిల్లలకు ప్రతి నెలా 10 మందికి పౌష్టికాహారం అందిస్తున్నారు. రక్తం అవసరమైన వారు ఎస్.వి.ఎన్.బ్లడ్ బ్యాకు ను సంప్రదించాలి.

- టివిఎల్ఎస్ నాగేశ్వరరావు, మేనేజర్, ఎన్‌విఎన్ బ్లడ్ బ్యాంక్ ఇన్‌ఛార్జి

పదివేల యూనిట్లు సేకరణ

న్యూ లైఫ్ బ్లడ్ బ్యాంక్ ను 2021 ఆగస్టు 10న ప్రారంబించాం. న్యూ లైఫ్ బ్లడ్ బ్యాంకు ద్వారా ఇంతవరకు పది వేల యూనిట్ల వరకు రక్తాన్ని సేకరించాం. రక్తం ప్రాధాన్యతను వివరిస్తూఅవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. తలసేమియా పిల్లలకు పౌష్టిక ఆహారాన్ని ప్రతి నెలా అందిస్తున్నాం. యువత మంచి నడవడిక తో ముందుకు నడిచి ఆరోగ్యంగా ఉంటే రక్తాన్ని అందించవచ్చు

- పైడి గోవింద రాజు, మేనేజర్, న్యూ లైఫ్ బ్లడ్ బ్యాంకు, విజయనగరం

బకాయి వేతనాలు ఇవ్వాలి

సిఐటియు ఆధ్వర్యాన గ్రీన్ అంబాసిడర్ల ఆందోళన

ప్రజాశక్తి-బాడంగి

గ్రీన్ అంబాసిడర్లకు బకాయి వేతనాలు చెల్లించాలని శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఎదుట సిఐటియు నాయకులు సురేష్ ఆధ్వర్యాన ఆందోళన చేపట్టారు. గ్రీన్‌అంబాసిడర్ల జీతాలు చెల్లించలేని మండల సమావేశాలు రద్దు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు సురేష్ మాట్లాడుతూ సుమారు ఏడాది కాలంగా వేతనాలు చెల్లించకుంటే గ్రీన్ అంబాసిడర్ల కుటుంబ పోషణ ఎలా సాగుతుందని ప్రశ్నించారు. వెంటనే జీతాలను చెల్లించాలని, లేకుంటే మండల సర్వసభ్య సమావేశం నిర్వహించడానికి వీలు లేదంటూ ఎంపిడిఒ కార్యాలయ గేటువద్దకు చేరుకున్నారు. దీంతో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ శ్రీలత.. ఆందోళన వద్దకు చేరుకుని, గ్రీన్ అంబాసిడర్లతో మాట్లాడారు. ఎంపిటిసి పాలవలస గౌరు, మాజీ ఎంపిపి బొంతు త్రినాథ్ జోక్యం చేసుకుని, 15 రోజుల్లో గ్రీన్ అంబాసిడర్ల మొత్తం జీతాలను చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. 15 రోజుల్లో వేతనాలు చెల్లించకుంటే నిరాహార దీక్షకు సిద్ధమవుతామని సిఐటియు నాయకులు సురేష్ హెచ్చరించారు.

ఇన్‌ఛార్జి ఎంపిడిఒ శ్రీలతతో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు సురేష్

వేదికలన్నింటిలో యోగా డెమో : జెసి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

యాగాంధ్ర లో భాగంగా ఈనెల 21న జరిగే యోగా కార్యక్రమానికి రిజిస్టర్ అయిన అన్ని వేదికలలో శనివారం యోగ డెమో నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ తెలిపారు. ఈ కార్యక్రమం 21న నిర్వహించే యోగాసనాలకు సన్నద్ధం చేయడానికేనని తెలిపారు. ఉదయం 7 నుండి 8 గంటల వరకు జిల్లాలో నమోదైన 5900 వేదికల వద్ద డెమో నిర్వహించాలన్నారు. శుక్రవారం జాయింట్ కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. లొకేషన్ ఇంచార్జ్ లు ఈమెయిల్ ఐ.డి లను కూడా అప్లోడ్ చేయాలని ఆదేశించారు. డెమో చేసిన ఫోటోలను, వీడియో లను కూడా అప్లోడ్ చేయాలన్నారు. యోగా శిక్షణ ప్రతి సచివాలయ పరిధి లో 3 విడతలలో నిర్వహించడానికి, ఒక్కో బ్యాచ్‌కు 50 చొప్పున 150 మందికి ఇస్తున్నట్లు తెలిపారు. మొదటి దశ లో 70 వేల మందికి శిక్షణ పూర్తి చేశామని, రెండవ విడత లక్ష మందికి ఈ వారంలో శిక్షణ ఇస్తామని తెలిపారు. మూడవ విడత వచ్చే వారంలో శిక్షణ ఇస్తామన్నారు. 21న యోగాలో పాల్గొనే వారు క్యూ ఆర్ కోడ్ ద్వారా లేదా వారి కీ ప్యాడ్ మొబైల్స్ కు వచ్చే నెంబర్ల ద్వారా లాగిన్ అవ్వాలన్నారు. జూమ్ కాన్ఫరెన్స్‌లో ఎంపిడిఒలు, డిఎల్‌డిఒలు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వేపాడలో యోగాసనాలు వేస్తున్న అధికారులు, సిబ్బంది, ప్రజలు

భారతీయ సంస్కృతిలో యోగా ఒక భాగం

విజయనగరం టౌన్ : భారతీయ సంస్కృతిలో సాంప్రదాయంగా వస్తున్న వ్యవస్థల్లో యోగా ఒకటని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. యోగాంధ్రలో భాగంగా శుక్రవారం పాల్ నగర్ ప్రాంతంలో యోగా ప్రక్రియ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. ప్రజలు, నగరపాలక సంస్థ సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు, స్వయం సహాయక సంఘాల మహిళలు అధికంగా పాల్గొన్నారు.

వేపాడలో యోగాంధ్ర

వేపాడ : యోగాంధ్ర కార్యక్రమాన్ని వేపాడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీ చేపట్టి, యోగా విశిష్టతపై అవగాహన కల్పించారు. అనంతరం యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ, ఇఒపిఆర్‌డి రవికుమార్, ఎఒ మహేష్, ఎంఇఒ బాలభాస్కర్, యోగా మాస్టర్ ట్రైనర్ పి.వెంకట్రావు, వేపాడ సర్పంచ్ ఎం.అర్జునమ్మ, తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు గుమ్మడి భారతి, తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్ర పోటీల్లో 'పల్లవి' విద్యార్థుల విజయం

విజయనగరంటౌన్ : అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర యోగా పోటీలలో పల్లవి విద్యా మందిర్ విద్యార్థులు మంతిని. జయంత్ (మండ్డల స్థాయి మెడిటేషన్ లో ప్రథమ బహుమతి), కర్రి హేమంత్ (సోల్ యోగా ఆసనాలలో తృతీయ బహుమతి) సాధించారు. సింక్రనైజ్డ్ యోగా గ్రూపు పోటీలలో విద్యార్థులు మంతిని జాయంత్, కర్రి. హేమంత్, దుర్గా ధనుష్ రాష్ట్ర స్థాయికి ఎంపిక య్యారు. విజయం సాధించిన విద్యార్థులను, యోగా టీచర్ సన్యాసిరావును పాఠశాల డైరెక్టర్లు ఎస్. శేఖర్ , పావని అభినందించారు.

విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్లు శేఖర్, పావని

కొలువుదీరిన అధికారులు

ప్రజాశక్తి- సంతకవిటి

సంతకవిటి మండల తహశీల్దార్‌గా బి.సుదర్శనరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. నెల్లిమర్ల నుంచి సంతకవిటి మండలానికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ భూసమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తామన్నారు. అనంతరం రెవెన్యూ అధికారులు.. ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

సుదర్శనరావు

నెల్లిమర్ల తహశీల్దార్‌గా శ్రీకాంత్

నెల్లిమర్ల : నెల్లిమర్ల మండల తహశీల్దార్‌గా కె.శ్రీకాంత్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కలెక్టరేట్ ఎఒగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. మండలంలో తహశీల్దార్‌గా పనిచేసిన సుదర్శనరావు సంతకవిటి బదిలీపై వెళ్లారు.

శ్రీకాంత్

గజపతినగరం ఎఒగా కిశోర్‌కుమార్

గజపతినగరం రూరల్ : గజపతినగరం మండల వ్యవసాయాధికారి పి.కిశోర్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. జామి మండలంలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఎఒగా పనిచేసిన సిహెచ్ ధనలక్ష్మి.. వ్యవసాయ శాఖ జెడి కార్యాలయానికి బదిలీపై వెళ్లారు.

కిశోర్‌కుమార్

19న జిల్లాలో షర్మిల పర్యటన

ప్రజాశక్తి-బొబ్బిలి

పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఈ నెల 19న జిల్లాలో పర్యటించనున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మువ్వల శ్రీనివాసరావు తెలిపారు. బొబ్బిలిలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా షర్మిల కృషి చేస్తున్నారని తెలిపారు. అందులో భాగంగా జిల్లాకు వస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు అల్లు వెంకటరమణ, లచ్చుపతుల రామానందం, గుడివాడ శ్రీను, రాంబార్కి రామకృష్ణ, రాయి రామారావు పాల్గొన్నారు.

305 మందికి బదిలీ

కౌన్సిలింగ్ వాయిదా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెడ్‌పి సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం జరిగిన ఉపాధ్యాయ బదిలీల్లో 305 మందికి కౌన్సిలింగ్ ద్వారా బదిలీ చేశారు. అనంతరం సాయంత్రం వరకు క్లస్టర్ ఖాళీలు చూపించకపోవడంతో శుక్రవారంతో పూర్తి అవ్వాల్సిన కౌన్సిలింగ్‌ను డిఇఒ మాణిక్యం నాయుడు వాయిదా వేసినట్లు ప్రకటించారు.

మన పాఠశాలను మనమే రక్షించుకోవాలి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మన పాఠశాలను మనమే రక్షించుకోవాలని జ్యూట్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కిల్లంపల్లి రామారావు కోరారు. శుక్రవారం కొండపేట ఎయిడెడ్ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ నేపథ్యంలో అక్కడ చదువుతున్న విద్యార్థుల తలిదండ్రులతో మాట్లాడారు. దశాబ్దాల కాలంగా జ్యూట్ యాజమాన్యం సహకారంతో కార్మికుల బిడ్డలకు చదువు అందించడానికి ఇక్కడ పాఠశాల ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. పాఠశాల మూసివేతకు గురికాకుండా చూసుకోవాల్సిన బాధ్యత మన అందరిపైనా ఉందన్నారు. కార్మికుల పిల్లలను ప్రయివేటు పాఠశాలకు పంపించకుండా ఇక్కడ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు.

లోగిస వసతి గృహంలో తనిఖీలు

ప్రజాశక్తి-గజపతినగరం రూరల్

మండలంలోని లోగిస గ్రామంలో ఎస్‌సి సమీకృత బాలుర సంక్షేమ వసతి గృహాన్ని శుక్రవారం సబ్‌కోర్టు న్యాయమూర్తి విజయ్ రాజ్ కుమార్ ఆకస్మాత్తుగా తనిఖీ చేశారు. వసతి గృహంలో వంటశాల పరిశుభ్రత, రిజిస్టర్లు, విద్యార్థుల ఆరోగ్యం, తాగునీరు సదుపాయంపైఆరా తీశారు. భవనానికి మరమ్మతులు చేయడానికి నిధులు మంజూరుపై ఆరా తీశారు. సంబంధిత అధికారులకు పలు సూచనలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాది సాయి శేఖర్ రావు పాల్గొన్నారు.

జయరాజు మాస్టార్‌ను బదిలీ చేయొద్దు

విద్యార్థులు, తల్లిదండ్రుల నిరసన

ప్రజాశక్తి-వంగర

మండలంలోని నీలయ్యవలస ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు జయరాజును బదిలీ చేయకుండా, ఇక్కడే కొనసాగించాలని పాఠశాల వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులు రవి, తల్లిదండ్రులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు జయరాజు ఇక్కడకు వచ్చినప్పటి నుంచి పిల్లలకు క్రమశిక్షణతోపాటు చక్కనైన విద్యా బోధన అందిస్తున్నారని తెలిపారు. అందువల్ల ఆయన్ని బదిలీ చేయకుండా కొనసాగించాలని డిమాండ్ చేశారు.

అందుబాటులో కేర్ హెల్త్ ఇన్సూరెన్సు

ప్రజాశక్తి-విజయనగరం

విజయనగరంలోని కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ వినూత్నమైన ఆరోగ్య భీమాను అతి తక్కువ ధరకు అందుబాటులో తీసుకొచ్చిందని ఆ బ్రాంచ్ మేనేజర్ కృష్ణమూర్తి, రీజనల్ ట్రైనింగ్ దుర్గాప్రసాద్ తెలిపారు. ఆస్తమా, రక్తపోటు, కొలెస్ట్రాల్, సుగర్ ఉన్నాసరే ఆరోగ్య బీమాలో కవర్ అయ్యేలా పాలసీని తీసుకొచ్చినట్లు తెలిపారు. శుక్రవారం ఆర్య ఫంక్షన్ హాల్‌లో ఈ నూతన ఆరోగ్య భీమాను విజయనగరం ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రజలంతా వినియోగించుకోవాలని కోరారు. ఆరోగ్యబీమా కావాలనుకునేవారు 6302090819 నెంబరును సంప్రదించాలని కోరారు.

నేడు టైలరింగ్ శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి-వేపాడ

వేపాడలో సోమవారం ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ప్రారంభిస్తారని టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు తెలిపారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలన్న ఉద్దేశంతో ఈ శిక్షణ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆటో బోల్తా

మహిళకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-చీపురుపల్లి

ఆటో బోల్తా పడటంతో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. శుక్రవారం వెదుళ్లవలస కూడలిలో చోటుచేసుకుంది. గరివిడి మండలం బొండపల్లి గ్రామానికి చెందిన ఎస్.సరస్వతి భర్త చీపురుపల్లిలో ఒక థియేటర్‌లో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం తన భర్తకి క్యారేజి తీసుకొని చీపురుపల్లి వచ్చి తిరిగి ఆటోలో వెళ్తున్నారు. జి.అగ్రహారం సమీపంలో వెదుళ్లవలస జంక్షన్ వద్ద బైక్ అడ్డంగా వచ్చింది. దాన్ని తప్పించబోయి ఆటో బోల్తా పడటంతో ఎస్.సరస్వతితోపాటు విజయనగరానికి చెందిన డి.సరస్వతికి కూడా గాయాలయ్యాయి. వీరిలో ఎస్.సరస్వతికి తీవ్ర గాయాలు కావడంతో చీపురుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు ఎస్ఐ కేసు నమోదు చేశారు.

13 మంది అరెస్టు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మండలంలో కొండవెలగాడలో పేకాట శిబిరంపై శుక్రవారం పోలీసులు దాడి చేసి, 13 మందిని అదుపులోకి తీసుకున్నారు. సీతమ్మ చెరువు వద్ద పేకాట ఆడుతుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ గణేష్ తెలిపారు. రూ.8860 నగదు సీజ్ చేసినట్లు చెప్పారు.

తూతూ మంత్రంగా మండల సమావేశం

ప్రజాశక్తి-బాడంగి

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా సాగింది. ఇన్‌ఛార్జి ఎంపిడిఒ శ్రీలత ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి సభ్యులు మొక్కుబడిగా హాజరయ్యారు. సగం మంది సభ్యులు కూడా రాకపోవడం గమనార్హం. వచ్చిన సభ్యులంతా కూడా తహశీల్దార్ కార్యాలయంలో ఒక్క పని కూడా అవ్వడం లేదని అసహనం వ్యక్తంచేశారు. వైస్ ఎంపిపి ఎస్.భాస్కర్‌రావు మాట్లాడుతూ సభ్యులంతా చెప్పింది వాస్తవమేనని, తహశీల్దార్ కార్యాలయ పరిస్థితి అసలు బాగోలేదని చెప్పారు. ఎవరు కూడా పని చేయడం లేదని, ఎమ్మెల్యే దృష్టిలో కూడా పెట్టామని తెలిపారు. ప్రజల కోసం పని చేయని వారు తక్షణమే మండలాన్ని వదిలేసి వెళ్లాలని హితవుపలికారు. సమావేశంలో ఎంపిపి బోగి గౌరి, జెడ్‌పిటిసి రామారావు, వైస్ ఎంపిపి రమేష్, మండల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి వైస్ ఎంపిపి భాస్కర్‌రావు

పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ శరత్

ప్రజాశక్తి-బొబ్బిలి

పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు హెచ్చరించారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ రెవెన్యూ ఉద్యోగులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఇంటి, కుళాయి, ఖాళీ స్థలాల పన్నులు శత శాతం వసూలు చేయాలన్నారు. రెవెన్యూ ఉద్యోగుల పనితీరుపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, వారి పని విధానంలో మార్పు రావాలని సూచించారు. డబుల్ ఎసెస్మెంట్లు ఎందుకు వచ్చాయో తేల్చాలని ఆదేశించారు. రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులు ఉదయం 8 గంటలకే విధులకు హాజరు కావాలని సూచించారు. మధ్యాహ్న సమయంలో సచివాలయాలకు అడ్మిన్ సెక్రటరీలు తాళాలు వేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, అలా అయితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో కమిషనర్ రామలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలని వినతి

ప్రజాశక్తి-గజపతినగరంరూరల్

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ బకాయిలు చెల్లించాలని కోరుతూ మండలంలోని పాతబగ్గాం సచివాలయంలో అగ్రికల్చరల్ అసిస్టెంట్ కోట ప్రవీణ్, వెటర్నరీ అసిస్టెంట్ రవి కుమార్‌లకు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెట్టంగి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కూలీలు శుక్రవారం వినతి అందజేశారు. రెండు పూటలా పని రద్దు చేసి ఒక పూటే పెట్టాలని, వేసవి అలవెన్స్ లు పునరుద్ధరించాలని, వంద రోజులు పని అందరికీ ఇవ్వాలని, రూ.600 కూలి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో చిరంజీవి, కోట సింహాద్రి, కర్రి రమణ, పోలమ్మ, పి.రాము, ఎస్.తవుడు రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వినతి అందిస్తున్న వ్యకాస నాయకులు, ఉపాధి కూలీలు

వైసిపి వాలంటీర్ల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శ్రీను

మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న కర్రి శ్రీను

ప్రజాశక్తి-కొత్తవలస

వైసిపి వాలంటీర్ల విభాగం రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా వైస్ ఎంపిపి కర్రి శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిసి, కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి గొరపల్లి జయప్రకాశ్, మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, నాయకులు పెదిరెడ్ల వెంకట సత్యనారాయణ, పిఎస్ఎన్ పాత్రుడు, లెంక వెంకన్న పాత్రుడు, లెంక నర్సింగరావు, భాస్కర్ పాత్రుడు, శ్రీను, కర్రి దేవుడు బాబు పాల్గొన్నారు.

పుస్తకాలు పంపిణీ చేస్తున్న మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్‌రావు

పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలోని అక్కివరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్‌రావు, సర్పంచ్ కంది కిరణ్‌కుమార్ పంపిణీ చేశారు. సన్నబియ్యంతో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐరన్ పోషకాలతో కూడిన సన్నబియ్యం ప్యాకెట్లను విద్యార్థులకు అందజేయడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా వలిరెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-చీపురుపల్లి

వైసిపి ప్రచార విభాగం జిల్లా అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు జన్మదిన వేడుకలు చీపురుపల్లిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పికి పాలవలస గ్రామంలో జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. సుమారు 200 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. చీపురుపల్లిలోని బాపూజీ వృద్ధాశ్రమంలో వృద్ధులకు, ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు మీసాల వరహాలనాయుడు, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షులు బెల్లాన వంశీకృష్ణ పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 35 మందికి ఎంపిక

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక విద్వాన్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 35 మంది ఎంపికైనట్లు ప్రిన్సిపల్ రెడ్డి మోహన్ చెప్పారు. జాబ్‌మేళాకు 72 మంది నిరుద్యోగులు హాజరు కాగా, 35 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని చెప్పారు. వీరికి నియామక పత్రాలను ఎంఎస్ఎన్ ఫార్మా కంపెనీ ప్రతినిధులు, ప్రిన్సిపల్ అందించారు.

రాయితీలపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-భోగాపురం

ఉద్యానవన పంటలపై ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను రైతులకు తెలియజేయాలని ఉద్యానవన శాఖాధికారి ఉమా భరణి సిబ్బందికి సూచించారు. మండలంలోని సవరవల్లి రైతు సేవా కేంద్రంలో ఉద్యానవన సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతం కంటే ఈసారి ఉద్యానవన పంటలపై ప్రభుత్వం అధిక రాయితీలు ప్రకటించిందన్నారు. మామిడి, జీడి, బొప్పాయి వంటి పంటలు వేసుకుంటే మంచిదని తెలిపారు. రైతులకు ఈ పంటలపై అవగాహన కల్పించాలని, అప్పుడే వారు సాగుకు ముందుకు వస్తారని చెప్పారు.

ఎమ్మెల్యే ప్రజా దర్బార్

ప్రజాశక్తి - కంటోన్మెంట్

ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతి రాజు పార్టీ కార్యాలయం అశోక్ బంగ్లాలో శుక్రవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా సిసి రహదారులు, కాలువలు, గృహ నిర్మాణం, కామాక్షినగర్ స్కూల్ జోన్ ఉన్న పరిధిలో స్పీడ్ బ్రేకర్స్ నిర్మించాలని తదితర వినతులు వచ్చాయి. వాటిని సంబంధిత అధికారులకు పంపించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు.

ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే అదితి



ధర్నా చేస్తున్న పేదలు

ఇళ్ల స్థలాల పట్టాలివ్వాలని ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నిరుపేదలకు పట్టలిచ్చే వరకు పోరాడతామని బడుగు బలహీన వర్గాల సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డి నారాయణరావు, చెన్నా ధర్మ డిమాండ్ చేశారు. శుక్రవారం ధర్మపురి ప్రాంతంలో పేదలతో కలసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో అర్బన్ ఏరియాలో నివశించేవారికి 2 సెంట్లు, రూరల్ ఏరియాలో నివశించే వారికి 3 సెంట్లతో పాటు 5 లక్షలు ఇంటి నిర్మాణం కోసం మంజూరు చేస్తామని ప్రకటించిందన్నారు. అందులో భాగంగానే విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న 30వ వార్డు, ధర్మపురి సర్వే నెం. 86/1,2,3,4,5 గయ్యాలులో 3.77 సెంట్లు భూమిని 22ఎ లోకి తీసుకొని 2007లో రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్లు నిలుపుదల చేసిందన్నారు. వెంటనే ఆ భూమిని 22ఎ నుండి తొలగించి బడుగు బలహీన వర్గాల వారికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

పారిశుధ్య విధానాన్ని మెరుగుపర్చాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో పారిశుధ్య విధానాన్ని మరింత మెరుగుపరచాలని ప్రజారోగ్య సిబ్బందికి నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాలు కురుస్తున్న తరుణంలో ప్రజారోగ్య సిబ్బందితో టాస్క్ ఫోర్స్ టీములను ఏర్పాటు చేయాలని ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తికి ఆదేశించారు. యూజర్ చార్జీలు, ట్రేడ్ లైసెన్సులు విధింపు, వసూళ్లను ఈ నెలాఖరు నాటికి శత శాతం పూర్తి చేయాలన్నారు. వర్షం తగ్గిన తర్వాత క్షేత్రస్థాయిలో పర్యటనలు జరిపి నీటి నిల్వలను గుర్తించి తక్షణమే ప్రక్షాళన అయ్యేలా చూడాలన్నారు.

దోమల నియంత్రణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించే విధంగా ప్రజలలో మరింత అవగాహన తీసుకురావాలన్నారు. ఫాగింగ్, స్ప్రేయింగ్ లను ముమ్మరం చేయాలన్నారు. సమావేశంలో పారిశుధ్య పర్యవేక్షకులు, మేస్త్రీలు, శానిటరీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-గజపతినగరం

గుడివాడ గ్రామంలో శుక్రవారం అమ్మ సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాధితునికి ఆర్థిక సహాయం చేశారు. గ్రామానికి చెందిన ఇంపసప్పల ప్రసాద్ రోడ్డు ప్రమాదంలో కుడి కాలు దెబ్బతినడంతో మంచానికే పరిమితమయ్యాడు. ఆర్థికంగా ఇబ్బంది పడుతుండటం, మందులకు కూడా డబ్బులు లేని పరిస్థితి వల్ల ఆయన ఆరోగ్యం మరింత క్షీణించింది. ఈ విషయం అమ్మ సేవ ఫౌండేషన్‌కు తెలియడంతో ఆ సభ్యులు స్పందించి రూ.54,520 ఆర్థిక సహాయాన్ని శుక్రవారం గజపతినగరం ఎస్ఐ కె.కిరణ్‌కుమార్ నాయుడు చేతుల మీదుగా బాధితునికి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రామునాయుడు, ఫౌండేషన్ అధ్యక్షులు డి.సురేష్, సభ్యులు పాల్గొన్నారు.

జనసేన గ్రామ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలో అన్ని గ్రామాల్లోనూ జనసేన కమిటీల ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని జొన్నాడలో జనసేన గ్రామ కమిటీ ఎన్నిక నిర్వహించారు. వాసుదేవరావుతోపాటు పరిశీలకులు సూర్యప్రకాశ్, పిన్నింటి రాజారావు, నియోజకవర్గ సీనియర్ నాయకులు దిండి రామారావు, వీర మహిళ ప్రమీల ఆధ్వర్యంలో గ్రామకమిటీని ఎన్నుకున్నారు అధ్యక్షులుగా కందిరాధ, కార్యదర్శిగా ప్రసాద్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సుబ్బు, కృష్ణ, శ్రీను, సురేష్, జగదీష్, మహేష్, రమేష్, గోపి పాల్గొన్నారు.

తల్లికి వందనంలో కోతలు వద్దు

ప్రజాశక్తి-బొబ్బిలి

తల్లికి వందనంలో కోతలు పెట్టకుండా రూ.15 వేలు జమ చేయాలని విద్యార్థి జెఎసి అధ్యక్షులు బి.సాయికిరణ్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూటమి అధికారంలోకి వస్తే రూ 15 వేలు ఇస్తామని చెప్పి రూ.13 వేలు మాత్రమే ఇవ్వడం అన్యాయమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరారు.

IN THE HONOURABLE COURT OF THE 1st Addl. JUNIOR CIVIL JUDGE (ADM) COURT AT VIZIANAGARAM

O.S.No.435/2023 I.A.333 /2023

Between:-
1) Smt.Gude Chinnammalu and 2 others ...Plaintiffs
And
1) Sri Vanapalli Chanti and 4 others ...Defendants
To
D-4. Smt.Vanapalli Gowramma, W/o late Ramana, Hindu, aged about 40 years, resident of Rakodu Village, Vizianagaram Mandal and District.
D-5. Vanapalli Yesu Kumari, D/o late Ramana, Hindu, aged about 20 years, resident of Rakodu Village, Vizianagaram Mandal and District.

Whereas the Plaintiffs instituted suit for partition against all of you in respect of joint undivided properties. You are hereby summoned to appear in this court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the suit or who shall be accompanied by some person able to answer all such questions on the **25th day of June 2025 at 10-30 O' clocks** in the forenoon to answer the claim, and further you are hereby directed to file within 30 days of Service of this summon a Written Statement of your defense and to produce on the said day all documents in your possession or power upon which you base your defense.

TAKE notice that in default of your appearance and to file your written statement within thirty days the suit will be heard and determined in your absence.

K.Kameswara Rao,
Advocate for Plaintiffs,
Door No.13-5-66, Kurellavari street, Kottapeta, Vizianagaram-535002.
Cell. 9640014321.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT VIZIANAGARAM
I.P 7/2025

Between:
Dukka Gurunaidu S/o Dukka Pothayya, aged 30 years, R/o Matsavanipalem H/o Kotha kopperla, Poosapatirega mandal, Vizianagaram district ....Petitioner
And
M/S Shri Ram Transport Finance Company Ltd Rptd by its GPA Holder, Sri Vaddadi Vijay, Vizianagaram. ... Respondent

NOTICE TO RESPONDENT

యిందు మూలంగా పై తెలిపిన రెస్పాండెంట్ గారికి తెలియజేయునది ఏమనగా విజయనగరం జిల్లా, పూసపాటిరేగ మండలం, కొత్త కొప్పెర్ల గ్రామ పంచాయతీ మదుర మత్సవానిపాలెం గ్రామ కాపురస్తుడు దుక్క గురునాయుడు, తండ్రి పోతయ్య తనకున్న అప్పులు చెల్లించుట ఆర్థిక స్తోమత లేదని, Insolvent గా డిక్లర్ చేయమని పైన తెలిపిన రెస్పాండెంట్ పై కోర్టులో I.P. No.7/2025 Petition దాఖలు చేసియున్నారు.

కావున ఎవరికైనను ఎటువంటి అభ్యంతరములు, ఆక్షేపణలు ఉన్న యెడల స్వయంగా గాని లేదా వకీలు గారి ద్వారా గాని **తే 04-07-2025 దీన ఉదయం గం॥ 10-30ని॥** పై తెలిపిన కోర్టులో హాజరు అయి ఆక్షేపణలు తెలియజేసుకోవలెనని లేని యెడల మీ పైన పరోక్షంగా తీర్మానించడం అగునని ఈ పత్రికప్రకటన ద్వారా నోటీసుగా తెలియజేయుచున్నాము.

Sri P.Janardhana Rao
Advocate, Vizianagaram,
D.No: 25-9-19, Palepuvari Street,
Cell : 9440585517

మహారాజ శ్రీ అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో, కాకినాడ

OS No. 1147/2024

శ్రీ బలభద్రపాత్రుని త్రివిక్రమ వగైరాలు ...వాదులు

వర్సెస్

వై. దుర్గా ప్రసాద్ రావు వగైరాలు ... ప్రతివాదులు

To:
వై. దుర్గా ప్రసాద్ రావు, S/o. సుబ్రహ్మణ్యం శాస్త్రీ, వయస్సు 70 సం, R/o. విజయనగరం టౌన్, విజయనగరం జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 535001

పై నెంబర్ దావాలో ప్రతివాది (D1) అయిన మీకు నోటీసు అమలు జరగని కారణం చేత శ్రీ యుత పై కోర్టు వారు ఈ దిన పత్రిక ద్వారా మీకు నోటీసు ఇచ్చుటకు ఆర్డర్ చేసియున్నారు. ఎన్నిసార్లు మీకు నోటీసులు పంపినప్పటికీ అవి సరి అయిన చిరునామా కానందున అవి మీకు చేరలేదు. అందువలన కోర్టు వారు పత్రికా ప్రకటనకు ఆర్డర్ చేసియున్నారు. కావున పై నెంబర్ దావా లో మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తేదీ 08.07.2025 ఉదయం 10:30 గంటలకు పై శ్రీ యుత కోర్ట్ వారి ఎదుట మీరు స్వయంగా కానీ, మీ తరుపు అడ్వకేట్ ద్వారా కానీ హాజరై తెలుపుకొనవలెను. లేని యెడల పై దావాని మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని తెలియజేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వులు మేరకు//

ఇట్లు
T. **రాజ రాజేశ్వరి భాస్కర్ రాజ్ కుమార్**
అడ్వకేట్స్
Ph: 9963383555

IN THE HONOURABLE COURT OF THE JUNIOR CIVIL JUDGE AT KOTHAVALSA
O.S. No. 13/2025

Between:
1.Sri Turpati Gangaraju .....Plaintiff
And:
Smt. Turpati Venkata Lakshmi & 2 others .... Defendants
To,
D-1: Smt. Turpati Venkata Lakshmi W/o. Late T.A.S.Karunakarudu, Hindu, aged 53 years, House Wife, R/o. D.No.4-21, B.C.Colony, Golzam Village, L.Kota Mandal, Vizianagaram District-535161
D-2: Turpati Sunitha D/o. Late T.A.S.Karunakarudu, Hindu, aged 32 years, -Rest Do-
D-3: Turpati Sai, S/o. Late T.A.S.Karunakarudu, Hindu, aged 28 years, -Rest Do-

NOTICE

Please take court notice/summons that the above suit is filed against the defendants 1 to 3 who succeeds the estate of the deceased Turpati Appala Sanyasi Karunakarudu, before the Hon'ble Junior Civil Judge Court at Kothavalasa for recovery of money, under pro-note dated 10-12-2021 for an amount of Rs. Rs.12,50,000/- (Rupees Twelve Lakhs fifty thousand only) along with interest thereon. Due to non service of Court Summons all of you i.e. defendants No.1 to 3, Thus, the Hon'ble Court pleased an order to serve the summons/notice under substituted service to the above stated Defendants 1 to 3.

Therefore hereby informing you that the above matter is posted to **27-06-2025** for your appearance before the Honourable junior Civil Judge at kothavalsa at **10-30 A.M.** If you fail to attend on that day, the matter will be heard and decided exparty.

(By Court Order)

J.V.V. JAGADEESWARA RAO
G.RAMANJINEYULU,
Advocates,
Vizianagaram District.
Cell: 9246616118

మహారాజశ్రీ ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) విజయనగరం వారి కోర్టులో
I.P.No.06/2025

Between :
1. దాడి జగదీష్ ....పిటిషనర్
And :
కర్రి వెంకటలక్ష్మి వగైరాలు ......రెస్పాండెంట్లు
To:
R.1. కర్రి వెంకటలక్ష్మి W/O ఈశ్వరరావు, 45సం॥, మంగళవీది, కొత్తవలస మండలం, విజయనగరం జిల్లా.
R.2. బీశెట్టి జగది W/O. అప్పారావు, 38సం॥, మంగళవీది, సిమెంట్ రోడ్, కొత్తవలస మండలం, విజయనగరం జిల్లా.
R.3. యెల్లాపు నీలిమ W/O. జగదీష్, 40 సం॥, రాజగారిపూలతోట, అనకాపల్లి మండలం, అనకాపల్లి జిల్లా.
R.4. బుద్ద కోటమ్మ W/O. గంగునాయుడు, 48 సం॥, బాపూజీనగర్, కంచపాలెం మెట్టు, కంచరపాలెం, విశాఖపట్నం జిల్లా.
R.5. లంకి లక్ష్మీ W/O. కామేశ్వరరావు, 46 సం॥, ఆర్‌ఆర్ వెంకటాపురం, గోపాలపట్నం, మండలం, విశాఖపట్నం జిల్లా.
R.6. ఇనాం ఈశ్వరరావు, S/O. లేటు అప్పన్న, 45 సం॥, ఆర్.ఆర్ వెంకటాపురం, గోపాలపట్నం, మండలం, విశాఖపట్నం జిల్లా.
R.7. ఆకుల దేవి, W/O. లోవరాజు, 39 సం॥, కృష్ణారాయపురం, వేపగుంట, పెందుర్తి మండలం, విశాఖపట్నం జిల్లా.
R.8. నెమలి ఈశ్వరమ్మ, W/O. కృష్ణ, 45 సం॥, మంగళవీధి, కొత్తవలస, విజయనగరం జిల్లా.
R.9. అట్టాడ రామలక్ష్మీ, W/O. రమేష్, 45 సం॥, మంగళవీధి, కొత్తవలస, విజయనగరం జిల్లా.
R.10. మల్ల తులసి, W/O. శ్రీను, 41 సం॥, గవరపాలెం గ్రామం, కొత్తవలస మండలం, విజయనగరం జిల్లా.
R.11. సరగడం శివరామకృష్ణ, S/O. అప్పారావు, 43సం॥, చింతల అగ్రహారం గ్రామం, పెందుర్తి మండలం, విశాఖపట్నం జిల్లా.
R.12. యల్లాపు గౌరి, W/O. సన్యాసిరావు, 40 సం॥, కళింగగడ్డ, ఎస్.కోట మండలం, విజయనగరం జిల్లా.
R.13. పి.పెంటయ్య, S/O. లేటు కోటయ్య, 40 సం॥, మంగళవీధి, కొత్తవలస, విజయనగరం జిల్లా.
R.14. గొంప రాముడు, S/o నానాజీ, 41 సం॥, ఎం.ఎస్.రామయ్య షాపింగ్‌మాల్, వేపగుంట గ్రామం, పెందుర్తి మండలం, విశాఖపట్నం జిల్లా.
R.15. లొకలాపు వంశీ, S/O. రాజేశ్వరరావు, 38 సం॥, ఎం.ఎస్.రామయ్య షాపింగ్‌మాల్, వేపగుంట గ్రామం, పెందుర్తి మండలం, విశాఖపట్నం జిల్లా.
R.16. ఎం.రమణి, W/O. రావు, 35 సం॥, ఎం.ఎస్.రామయ్య షాపింగ్‌మాల్, వేపగుంట గ్రామం, పెందుర్తి మండలం, విశాఖపట్నం జిల్లా.

ఇందుమూలముగా పైన తెలిపిన ప్రతివాదులందరికి తెలియజేయునది ఏమనగా దాడి జగదీష్, S/o కనకరాజు, 26సం॥, డోర్‌నెం. 11-105, మంగళవీధి, సబ్బవరం రోడ్, కొత్తవలస, విజయనగరం జిల్లా మరియు తమకున్న అప్పులు చెల్లించలేని శక్తిలేదని తీర్పు చేయమని మరియు పైన తెలిపిన ప్రతివాదుల నుండి రక్షణ కల్పించమని శ్రీ సీనియర్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్, కోర్టు విజయనగరంలో I.P. No.6/2025 పిటిషన్ దాఖలు చేసియున్నారు. కావున ఎవరికైనను ఎటువంటి అభ్యంతరములు, ఆక్షేపణలు వున్న యెడల స్వయముగా గాని లేదా వకీలు గారి ద్వారా గాని **తే 02-07-2025దిన ఉదయం గం॥ 10-30 ని॥** పైన తెలిపిన కోర్టులో హాజరు కావలెనని, లేని పక్షంలో శ్రీ కోర్టువారు పరోక్షంగా తీర్మానించడమగునని ఈపత్రిక ప్రకటన ద్వారా నోటీసుగా తెలియజేయుచున్నాము.

//By Order of the Honourable Court//

గవర కృష్ణ
బోజంకి సన్యాసిరావు
అడ్వకేట్స్, కొత్తవలస,
Cell No.:8341291598